sahanamvande.com

epaper.sahanamvande.com

సహనం వందే

హైదరాబాద్ | 27-07-2026 సోమవారం | సంపుటి-02 సంచిక : 112 EDITOR: ROHINI



గంగలో చికెన్ తింటే నేరమా?

సుప్రీం జడ్జి భుయాన్ సంచలన వ్యాఖ్యలు

గంగ నదిపై బోటులో చికెన్ బిర్యానీ తిన్నారనే నెపంతో 14 మంది ముస్లిం యువకులను అకారణంగా అరెస్టు చేసి 3 నెలల పాటు జైల్లో ఉంచడం మన చట్టాల దుస్థితికి నిదర్శనమని సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్వల్ భుయాన్ తీవ్రంగా మండిపడ్డారు. సాధారణ జీవనశైలిని, ప్రజాస్వామ్య నిరసన హక్కులను అణచివేస్తున్న తీరుపై ఆయన భోపాల్‌లో జరిగిన సభలో చేసిన సంచలన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా పెను సంచలనం రేపుతున్నాయి.
- సహనం వందే, భోపాల్

- అలాంటి చట్టం దేశంలో లేనేలేదని కామెంట్
- బెయిలుకు నెలల తరబడి తిప్పటంపై విమర్శ
- నిరసన గొంతుకలపై నిర్బంధాలపై మండిపాటు
- విదేశీ రగడపై హైకోర్టు వింత వ్యాఖ్యలా?
- కోర్టు తీర్పులపై చర్చలు జరగాలని విజ్ఞప్తి
- దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన కామెంట్స్

భోపాల్‌లోని నేషనల్ లా ఇన్‌స్టిట్యూట్ యూనివర్సిటీలో జస్టిస్ జీపీ సింగ్ మెమోరియల్ లెక్చర్‌లో జస్టిస్ ఉజ్వల్ భుయాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. రంజాన్ మాసంలో ఉపవాస విరమణ సమయంలో గంగ నదిలో బోటుపై చికెన్ బిర్యానీ తిన్నారనే కారణంతో 14 మందిని అరెస్టు చేయడం ఎలాంటి చట్టాల కిందకు వస్తుందని ఆయన నిలదీశారు. గంగ నదిపై చికెన్ తినకూడదనే చట్టం దేశంలో ఎలాంటిది లేదని స్పష్టం చేశారు. ఇలాంటి సాధారణ పనులను కూడా నేరంగా మలుస్తూ అమాయకులను 3 నెలల పాటు జైళ్లలో మగ్గేలా చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని ఆయన తీవ్రంగా విమర్శించారు.

బెయిలు షరతులతో గొంతు నొక్కుతారా?

కోర్టులు సకాలంలో స్పందించి బెయిలు మంజూరు చేస్తున్నప్పటికీ విధిస్తున్న కఠినమైన షరతులు ప్రజల ప్రాథమిక హక్కులను కాలరాస్తున్నాయని జస్టిస్ భుయాన్ ఆందోళన వ్యక్తం చేశారు. బెయిలు ఇచ్చే సమయంలో బహిరంగ సభలకు వెళ్లవద్దని, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టవద్దని, దేశం విడిచి వెళ్లవద్దని కండిషన్లు పెడుతున్నారని చెప్పారు. ఇలాంటి కఠినమైన ఆంక్షలతో ప్రజలు తమ నిరసన గొంతును బయటపెట్టకుండా పరోక్షంగా భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆయన కుండబద్దలు కొట్టారు. దేశంలో భిన్నాభిప్రాయాలను వ్యక్తపరిచే ప్రజాస్వామ్య స్థలం రోజురోజుకూ దారుణంగా తగ్గిపోతోందని ఆయన హెచ్చరించారు.

గాజా నిరసనలపై హైకోర్టు వింత వ్యాఖ్యలు...

ముంబైలోని ఆజాద్ మైదాన్‌లో పాలస్తీనా, గాజాలో జరుగుతున్న మారణహోమానికి వ్యతిరేకంగా నిరసన తెలపడానికి సీపీఎం పెట్టుకున్న దరఖాస్తును గత ఏడాది జూలైలో బొంబై హైకోర్టు కొట్టివేయడాన్ని జస్టిస్ భుయాన్ తీవ్రంగా తప్పుబట్టేశారు. మన దేశంలో సమస్యలు చాలా ఉన్నాయని, విదేశీ విషయాలు మనకెందుకని, ముందు దేశభక్తిని చాటుకోవాలని ఆ హైకోర్టు వ్యాఖ్యానించడం తనకు ఎంతో ఆశ్చర్యం కలిగించిందని ఆయన చెప్పారు. భారతీయులు ఇతర దేశాల్లో జరుగుతున్న అన్యాయాలపై గళం విప్పడాన్ని కూడా తప్పుబట్టడం హాస్యాస్పదమని ఆయన పేర్కొన్నారు.

తీర్పులపై బహిరంగ విమర్శలు ఉండాలి...

న్యాయ వ్యవస్థ ఎప్పుడూ తప్పు చేయదని భావించకూడదని, సుప్రీంకోర్టు ఇచ్చిన ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్లు వంటి తీర్పులను కూడా న్యాయ విద్యార్థులు, లాయర్లు తీవ్రంగా విశ్లేషించాలని జస్టిస్ భుయాన్ పిలుపునిచ్చారు. తీర్పులను విమర్శించడం అంటే న్యాయమూర్తులను విమర్శించడం కాదని ఆయన స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ జడ్జీలను పొగుడుతూ ఉంటే వ్యవస్థలో లోపాలు ఎప్పటికీ సరికావని అన్నారు. రిపబ్లిక్ ఏర్పడి 75 ఏళ్లు పూర్తయిన తరుణంలో న్యాయవ్యవస్థ ఎక్కడ ఉందో ప్రజలే బేరీజు వేస్తున్నారని, ప్రజా నమ్మకాన్ని నిలబెట్టుకోవడానికి జడ్జీలు అంతర్మథనం చేసుకోవడం చాలా అవసరమని ఆయన సూచించారు.

ఉపా చట్టం... డీలా పడిన విచారణలు

దేశంలో పెరుగుతున్న కఠిన చట్టాల వినియోగంపై జస్టిస్ భుయాన్ గతంలోనూ తీవ్రమైన ఆందోళన వ్యక్తం చేశారు. బెంగుళూరులో జరిగిన సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ సదస్సులో ఆయన ప్రస్తావించిన సంగతి తెలిసిందే. ఉపా చట్టం దుర్వినియోగం అవుతోందని గుర్తుచేశారు. సకాలంలో విచారణ జరగకుండా ఏళ్ల తరబడి జైళ్లలోనే మగ్గిపోవడం అభివృద్ధి చెందుతున్న భారతదేశానికి ఏమాత్రం తగదని ఆయన వ్యాఖ్యానించారు. విభిన్న అభిప్రాయాలను గౌరవించే తత్త్వం పెరిగినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన తేల్చిచెప్పారు.

ప్రజాస్వామ్య పరిరక్షణే అంతిమ లక్ష్యం

దేశంలో నిరసన తెలిపే హక్కు, వాక్ స్వాతంత్రం ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులని జస్టిస్ భుయాన్ గుర్తుచేశారు. చర్చలు, అసమ్మతి గొంతుకలే నిజమైన ప్రజాస్వామ్యానికి ఊపిరి పోస్తాయని స్పష్టం చేశారు. నిరసనకారులను అణచివేయడం, విచారణ పేరుతో కాలయాపన చేయడం ప్రజాస్వామ్య మూలాలకే ముప్పు తెస్తాయని ఆయన హెచ్చరించారు. పౌరుల విశ్వాసమే న్యాయ వ్యవస్థకు శ్రీరామరక్ష అని, పబ్లిక్ పర్సెప్షన్ ఆధారంగానే వ్యవస్థల మనుగడ ఆధారపడి ఉంటుందని ఆయన స్పష్టమైన సందేశం ఇచ్చారు.

ఓర్పు ముసుగులో బానిసత్వం

పోరాట పటిమను చంపే విషం

- కష్టాలను భరించడమే గొప్ప లక్షణమా?
- వ్యవస్థల తప్పులను కప్పిపుచ్చే అస్త్రం
- కార్పొరేట్ వేధింపుల సంస్కృతి
- పని ఒత్తిడి పెంచి యోగా క్లాసులా?

జీవితం అంటే సర్దుకుపోవడమనీ... ప్రతి కష్టాన్ని మౌనంగా భరించడమే గొప్ప లక్షణమనీ నమ్మిస్తూ వ్యవస్థల తప్పులను కప్పిపుచ్చేందుకు ఒక కొత్త అస్త్రంగా ఓర్పును వాడుతున్నారు. ఎదురుతిరిగే గొంతులపై కత్తి పెడుతున్నారు.
- సహనం వందే, హైదరాబాద్

ఎకానమీ కుప్పకూలినా, ప్రకృతి వైపరీత్యాలు ముంచెత్తినా, నిరుద్యోగం విలయతాండవం చేసినా అందరూ చెప్పే ఒకే ఒక సలహా ఓపిక పట్టడం. ఒకప్పుడు ఏదైనా సమస్య వస్తే ప్రభుత్వాన్ని నిలదీసేవారు, దాన్ని ఎలా పరిష్కరించాలని ఆలోచించేవారు. కానీ ఇప్పుడు రూటు మార్చేశారు, సిస్టమ్‌ను బాగుచేయడం చేతకాక, ఆ వైఫల్యాల భారాన్ని పూర్తిగా ప్రజల మీదకు నెట్టేస్తున్నారు. ఇది కేవలం ఒక మంచి లక్షణం కాదు... పాలకుల బాధ్యతారాహిత్యాన్ని కప్పిపుచ్చడానికి సృష్టించిన ఒక పెద్ద మాయాజాలం.

ఆర్థిక సంక్షోభం... దోపిడీ

మన ఆర్థిక వ్యవస్థను తీసుకుందాం. కోట్లాది మంది ప్రజలు ఉపాధి కోల్పోతున్నప్పుడు, ధరలు ఆకాశాన్నంటుతున్నప్పుడు ప్రభుత్వాన్ని నిలదీయాలి. కానీ దానికి బదులుగా సామాన్యుడికి ద్రవ్యోల్బణాన్ని భరించే ఓర్పు ఉండాలని, ఎలాంటి క్లిష్ట పరిస్థితుల్లోనైనా బడ్జెట్ సర్దుబాటు చేసుకునే సహనం ఉండాలని నీతులు చెబుతుంటారు. అంటే వ్యవస్థ ఎంత దారుణంగా విఫలమైనా ఆ దోపిడీని మౌనంగా భరించే బాధ్యత మాత్రం కేవలం మీదేనని పరోక్షంగా హెచ్చరిస్తున్నారు. ఇది ప్రజాస్వామ్యంలో ప్రజలను బానిసలుగా మార్చడం కాదా?

కార్పొరేట్ వేధింపుల సంస్కృతి

మానసిక ఆరోగ్యం విషయంలో కూడా ఈ సహనాన్ని ఒక హింసాత్మక ఆయుధంగా మారుస్తున్నారు. కార్పొరేట్ కంపెనీలలో ఉద్యోగుల మీద విపరీతమైన పని ఒత్తిడి పెంచి వారి జీవితాలను ఛిన్నాభిన్నం చేస్తున్నారు. ఆ తర్వాత ఉద్యోగులకు యోగా క్లాసులు, మైండ్‌ఫుల్‌నెస్ సెషన్లు ఏర్పాటు చేసి వారిలో ఓర్పు పెంచాలని చూస్తున్నారు. అసలు పనిగంటలు తగ్గించడం, సరైన వేతనాలు ఇవ్వడం, మానసిక క్షోభకు కారణమైన ఆ దోపిడీ వాతావరణాన్ని మార్చడం గురించి ఎవరూ మాట్లాడరు. తప్పు కంపెనీది అయితే, ఆ వేధింపులను భరించలేకపోవడం ఉద్యోగి లోపమన్నట్లుగా వక్రీకరించి ప్రచారం చేస్తారు.

మార్కెట్ శక్తుల కొత్త వ్యాపారం

మార్కెట్ శక్తులు కూడా ఈ సహనపు సంస్కృతిని చాలా చాకచక్యంగా క్యాష్ చేసుకుంటున్నాయి. ఏదైనా సంక్షోభం వచ్చినప్పుడు ప్రజలు ఎలా సర్దుకుపోవాలో నేర్పించే కోర్సులు, యాప్‌లు, మోటివేషనల్ స్పీచ్‌లు పుట్టుకొస్తున్నాయి. దీనివల్ల అసలు సమస్య ఎక్కడుందో నిలదీయాల్సిన సమాజం, ఆ సమస్యతోనే సర్దుకుపోయేలా మారిపోతోంది. ప్రజలను మానసికంగా, ఆర్థికంగా అణచివేసి ఆ తర్వాత వాళ్ళే ఆ అణచివేతను భరించేలా శిక్షణనిచ్చే కొత్త తరహా వ్యాపారం ఇది. దీన్ని గమనించాల్సిన సమయం ఆసన్నమైంది.

పోరాట పటిమను చంపే విషం

చరిత్రను తిరగేసి చూస్తే మానవ నాగరికత ఇంతటి అభివృద్ధి సాధించడానికి కారణం కేవలం కష్టాలను భరించడం కాదు. కష్టాలను ఎదిరించడం, వాటికి వ్యతిరేకంగా తిరగబడడం, సిస్టమ్‌ను మార్చాలని డిమాండ్ చేయడమే మనల్ని ఇక్కడివరకు తెచ్చింది. భరించడం వేరు, ప్రతిఘటించడం వేరు. జీవితం కేవలం సర్దుకుపోవడానికి కాదు, సంతోషంగా జీవించడానికి, తప్పులను ప్రశ్నించడానికి కూడా ఏర్పడింది. ప్రతిదానికీ తలవంచుకుంటూ, ప్రతి మోసాన్ని మౌనంగా భరిస్తూ పోతే చివరికి మన ఉనికినే కోల్పోయే ప్రమాదం ఉంది. అన్యాయాన్ని ఎదిరించాల్సిన గొంతు మూగబోతే, ఆ సమాజం మనుగడ ప్రశ్నార్థకం అవుతుంది.

ఇన్‌స్టా రీల్స్... పాలిటిక్స్ షిఫ్ట్

వాట్సాప్ నుంచి ఇన్‌స్టాగ్రామ్‌కు

- టెక్నాలజీతో కొత్త రాజకీయాలు
- కొత్త శకానికి నాంది పలికిన టెక్నాలజీ
- పాత పద్ధతులు ఖతం... యువత సవాల్

రాజకీయాల్లో ఇప్పుడు పాత పద్ధతులు పూర్తిగా కనుమరుగైపోయాయి. కేవలం 5 సెకన్లలో ఆకట్టుకుంటేనే ఇక్కడ లైక్ పడుతుంది లేదంటే స్క్రోల్ అయిపోతుంది. వాట్సాప్ గ్రూపుల నుంచి నేరుగా ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ వరకూ పాలిటిక్స్ షిఫ్ట్ అయిపోయాయి. ఈ డిజిటల్ జనరేషన్ నాయకులకు చుక్కలు చూపిస్తోంది. - సహనం వందే, హైదరాబాద్



ఒకనాడు రాజకీయ పార్టీలంటే కరపత్రాలు, గోడమీద రాతలు, లౌడ్‌స్పీకర్ల మోతలు ఉండేవి. కాలం మారుతున్న కొద్దీ ఆ ప్రచార శైలి వాట్సాప్ కి షిఫ్ట్ అయింది. ప్రతీ నియోజకవర్గానికి, ప్రతీ గల్లీకి వాట్సాప్ గ్రూపులు పుట్టుకొచ్చాయి. నాయకుల ప్రసంగాలు, పథకాలు సెకన్లలో మొబైల్ స్క్రీన్‌లపై ప్రత్యక్షమయ్యాయి. ఇదే టెక్నాలజీ గతంలో రాజకీయ పార్టీలను అధికారంలోకి తేవడంలో కీలక పాత్ర పోషించింది. ఆ తరం ఓటర్లను ఆకట్టుకోవడానికి వాట్సాప్ ఒక బ్రహ్మాస్త్రంలా పనిచేసింది. అయితే కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు కదా.

ఓల్డ్ స్కూల్ వైబ్ ఖతం

ఇప్పుడు రాజకీయాలను శాసించే స్థాయికి వచ్చిన కొత్త తరానికి వాట్సాప్ అంటేనే ఒక ఓల్డ్ స్కూల్ వైబ్ వచ్చేస్తోంది. నేటి యువత చూపు పూర్తిగా ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, షార్ట్స్, క్విక్ కంటెంట్ వైపు మళ్లింది. కేవలం 5 సెకన్లలో ఆకట్టుకుంటేనే ఇక్కడ లైక్ పడుతుంది, లేదంటే స్క్రోల్ అయిపోతుంది. ఈ వేగవంతమైన సమాచార ప్రపంచంలో పాతకాలపు ప్రచారాలు పూర్తిగా బోరింగ్‌గా మారిపోతున్నాయి. రాజకీయ పార్టీలు ఇప్పటికీ తమ పాత కాలపు వ్యూహాలనే నమ్ముకుని ముందుకు వెళ్తున్నాయి. సమస్యలు వచ్చినప్పుడు లేదా యువత తిరగబడినప్పుడు కేవలం పోలీసు బలాలను, బ్రూట్ ఫోర్స్‌ను నమ్ముకోవడం పరిపాలనా విధానంగా మారింది.

బలప్రయోగం అస్సలు వర్కవుట్ కాదు...

ఈ బలప్రయోగం అనేది కేవలం సరిహద్దుల్లో, గ్రామాల్లో మాత్రమే తాత్కాలికంగా పనిచేయవచ్చు. పట్టణాలు, ప్రధాన కేంద్రాల్లో ఈ పద్ధతులు అస్సలు వర్కవుట్ కావు. ఈ కొత్త తరంతో ముఖాముఖి వ్యవహరించడం ప్రభుత్వాలకు, రాజకీయ నాయకులకు పెను సవాల్‌గా మారుతోంది. గతంలో లాగా ఎవరో చెప్తే వినే ఓపిక గానీ, భయపడే మనస్తత్వం గానీ నేటి యువతలో కనపడడం లేదు. ప్రతి దాన్ని ప్రశ్నించడం, లాజికల్‌గా ఆలోచించడం వీళ్ల ప్రత్యేకత. అందుకే సంప్రదాయ రాజకీయ నాయకులు ఈ డిజిటల్ యువత ఎదుట నిలబడలేక తంటాలు పడుతున్నారు.

రీల్స్‌తో వైరల్ అవుతున్న వైఫల్యాలు

ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ కేవలం వినోదం కోసం మాత్రమే అనుకుంటే పొరపాటే. ఇవాళ సమాజంలో జరుగుతున్న అన్యాయాలను, ప్రభుత్వ వైఫల్యాలను నిమిషాల వ్యవధిలో వైరల్ చేసే శక్తి ఈ వేదికలకు ఉంది. ఒక సాధారణ యువకుడు తన ఫోన్‌లోనే క్యాప్చర్ చేసే చిన్న వీడియో దేశవ్యాప్తంగా చర్చకు దారితీస్తోంది. నాయకుల తప్పులను ఎత్తిచూపడంలో ఈ జనరేషన్ సోషల్ మీడియానే ఒక అస్త్రంగా మలుచుకుంటోంది. ప్రభుత్వాలు అనుసరిస్తున్న కఠినమైన చట్టాలు, అరెస్టులు లేదా బలవంతపు అణచివేత చర్యలు ఈ జనరేషన్‌ను ఆపలేకపోతున్నాయి.

మీమ్స్‌తో తలకిందులవుతున్న సమీకరణాలు

గతంలో ఓటర్లను ఒక తాటి మీదకు తెచ్చేందుకు పెద్ద కసరత్తు అవసరం ఉండేది. కానీ నేడు ఇన్‌స్టాగ్రామ్ ట్రెండ్స్, మీమ్స్ రూపంలో ప్రభుత్వ విధానాలపై వ్యతిరేకత క్షణాల్లో పాకుతోంది. ఒక మీమ్ లేదా ఒక పదునైన ఎడిటెడ్ వీడియో చాలు, కోట్ల మందికి ఆ విషయం చేరుకోవడానికి. సాంకేతికతను ఏ పార్టీ అయితే వేగంగా అర్థం చేసుకుంటుందో, వారే రేపు మనుగడ సాగిస్తారు. రాజకీయాల్లో ఈ జనరేషన్ మార్పు కేవలం ప్రచార శైలికి మాత్రమే పరిమితం కాలేదు. నేతల నైతికతపై, వారి హామీలపై నిలదీసే స్థాయికి ఎదిగింది. మా అభివృద్ధి ఎక్కడ అని ప్రశ్నిస్తున్న ఈ యువతను మభ్యపెట్టడం ఎవరితరమూ కాదు.